క్లుప్తంగా

భూలక్ష్మి, మహాలక్ష్మి ప్రతిష్ఠ మహోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న శాస్త్రి నగర్‌లో భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి వైభవంగా ప్రతిష్ఠించారు. శనివారం ఊరేగింపుగా బయలుదేరిన కాలనీవాసులు అమ్మవార్లను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పూజారులు విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ పసుపు, కొబ్బరి కాయలు పలు రకాల సామాగ్రితో ప్రతిష్ఠించారు. కాలనీలలో ఆయురారోగ్యాలతో పాటు పాడి పంటలు అధికంగా రావాలని ప్రతిష్ఠించారు. బైండ్ల పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ సాయిరి పద్మ, బండగోపాల్, కల్వల మధు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందజేస్తున్న దేవేందర్

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన మెంగని చంద్రశేఖర్‌కు సేవారత్న అవార్డును బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ దేవా కళాబృందం సభ్యులు అందజేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో పలు రకాల సేవలు చేసిన వారిని గుర్తించి ఉగాది పురస్కారం అవార్డులను ప్రదానం చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన చంద్రశేఖర్, వీరాచారికి ఈ అవార్డు అందుకున్నారు. నిర్వాహకులు దేవేందర్, పలువురు ఉన్నారు.

శనిత్రయోదశి పూజలు

సుల్తానాబాద్: పట్టణంలో శివాలయంలో ఉన్న నవగ్రహ పూజలు, శని త్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ విగ్రహం వద్ద పూజారి మహేశ్‌కుమార్ పూజ నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న రాజ్‌కుమార్

సుల్తానాబాద్: పట్టణంలోని దివ్యాంగులకు, అనాథలు, భిక్షాటన చేసే వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని రంగంపల్లెకు చెందిన కొండి నిశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు కొండి రమ్య–శ్రీనివాస్ దంపతులు అన్నదానం చేశారు. యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తుమ్మ నిశాంత్, సభ్యులు దేశెట్టి రమేశ్, ఆరెపల్లి మణి, సంపత్, సెంటర్ సిబ్బంది సరస్వతి, కల్యాణి పాల్గొన్నారు.

పుట్ట నారాయణ వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: రమిజాబీ నిరసన సందర్భంగా 1978లో స్థానిక న్యూ అశోకా థియేటర్ సమీపంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో చనిపోయిన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ వర్ధంతిని శుక్రవారం రాత్రి స్నేహ సాహితీ గ్రంథాలయంలో నిర్వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, రచయిత ఏలేశ్వరం వెంకటేశం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుట్ట నారాయణ కుటుంబాన్ని ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని వారు కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌరహక్కుల సంఘం నాయకులు పుట్ట రాజన్న, శ్రీపతి రాజగోపాల్, పుల్ల సుచరిత, నక్క సత్యనారాయణ, శేఖర్, పోశయ్య, వెంకటేశ్, రమేశ్, నర్సింగరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముత్తారం: ముత్తారంలో ఆదివారం విద్యుత్ ఉపకేంద్రంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ హనుమాన్‌దాస్‌నాయక్ తెలిపారు. విద్యుత్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన

• ఆర్డీవో హనుమానాయక్



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ అన్నారు. సెంటినరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలో పీవో, ఏపీవో అధికారులకు శనివారం ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్‌ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన ఉండాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్లు వాటి పనితీరు, రిపేరు వస్తే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణలో తహసీల్దార్లు ఎండీ ఆరిఫోద్దిన్, ఎ.నాగరాజు, బి.రాంచందర్‌రావు, డి.రాజయ్య, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కాచాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం తులసి

జూలపల్లి: రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు పొందాలని సెర్ప్ జిల్లా మేనేజరు రవి సూచించారు. కాచాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాలనునాయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎం సుధాకర్, కమిటీ సభ్యులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మారం: మండలంలోని రచ్చపల్లి గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం తులసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యాన్ని కేంద్రంలో విక్రయించి మద్దతు ధరలు పొందాలని సూచించారు. రైతులు కేంద్రంలో విక్రయించిన తర్వాత ఎలాంటి జాప్యం లేకుండా రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయని ఆమె వివరించారు. నిబంధనల ప్రకారం కేంద్రానికి ధాన్యం తీసుకురావాలని కోరారు. గ్రామ రైతులు, మహిళా సంఘం సభ్యులు, వీవోలు, వీవోఏ, సెంటర్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని గ్రామస్తుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి మానేరు వాగులోంచి ఇసుకను తరలించొద్దని, ఇసుక క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇసుక రీచ్ వద్ద గ్రామస్తులు నిరసన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకను తరలించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్వారీని రద్దు చేయాలని కోరారు.

ఉత్తమ పని విధానానికి శాఖాపరంగా గుర్తింపు



ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: ఉత్తమ పని విధానానికి పోలీసుశాఖ తరపున తగిన గుర్తింపు ఉంటుందని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలక్షన్ కోడ్ ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా మార్చిలో ప్రతిభ కనబర్చిన పలువురు ఉత్తమ సిబ్బందికి క్యాష్ అవార్డులు అందజేశారు. రెండో సీఐ బి.రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

మంథని: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మంథనిలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. పట్టణశాఖ అధ్యక్షుడు సంతోష్, నాయకులు నాంపల్లి రమేశ్, కొండపాక సత్యప్రకాశ్ ఉన్నారు.

రామగుండం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అంతర్గాం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బోడకుంట జనార్దన్ కాషాయ పతాకావిష్కరణ చేశారు. మండల ప్రతినిధులు బాణాల స్వామి, బోడకుంట సుభాష్, బాలసాని సత్తయ్యగౌడ్, మాడ ప్రభాకర్ రెడ్డి, కొల్లూరి పురుషోత్తం, బొంతు రఘు ఉన్నారు.

రామగిరి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం శనివారం సెంటనరీకాలనీలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు. నాయకులు తీగల శ్రీధర్, మేరుగు శ్రీకాంత్, ఇరుగురాల సంపత్, రోడ్డ విజయ్, కొప్పుల క్రాంతి, సంజయ్, సతీశ్ పాల్గొన్నారు.

ఓసీపీలో పనివేళలు మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని: మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఓసీపీల్లో పనివేళలు మార్చాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. శనివారం గని అధికారులకు వినతిపత్రం అందజేశారు. రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, మహిళా కార్మికులకు పని ప్రదేశాల్లో సరైన వసతులు కల్పించాలన్నారు. క్వారీలో దుమ్ము ధూళి లేవకుండా వాటర్ స్ప్రేయింగ్ చేయించాలని, నూతన డంపర్లు, డోజర్లు, శావల్స్, గ్రేడర్స్, డ్రిల్స్ కొనుగోలు చేయాలని కోరారు. నాయకులు కచ్చకాయల సదానందం, పోతరవేని సమ్మయ్య, నీరటి సాగర్, దేవేంద్రాచారి పాల్గొన్నారు.

ఓదెలుకు ఉగాది పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఓదెలు

రామగిరి: మండలంలోని నాగెపల్లి మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలుయాదవ్ 2024 ఉగాది పురస్కారం అవార్డు అందుకున్నారు. గోదావరిఖనికి చెందిన బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ, దేవా కళాబృందం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల పేరిట అవార్డు అందజేశారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి సహకారంతో ట్రాఫిక్ భద్రత, జాగ్రత్తలు అంశంపై ఆర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ జంక్షన్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు హాజరయ్యారు. ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సై రవిప్రసాద్, డాక్టర్ లక్ష్మీవాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్, వరుణ్, మణికంఠ, విష్ణుప్రియ, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్

రామగుండం: ఎండాకాలం పురస్కరించుకొని కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చుకునేందుకు వీలుగా కార్యాలయ ప్రాంగణంలో శనివారం చలివేంద్రాన్ని తహశీల్దార్ పనగంటి రామ్మోహన్ రావు ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ సాయి కృష్ణ, ఆర్ఐ రాజేందర్ ఉన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని తహసీల్దార్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ భానుకుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అనుమతి లేకుండా డీజేలు వినియోగించొద్దు

పాలకుర్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన డీజే సౌండ్‌సిస్టం నిర్వాహకులకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై స్వామి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం 9మంది డీజే సౌండ్ యజమానులను తహసీల్దార్ జ్యోతి ఎదుట బైండోవర్ చేశారు.

శాంతిస్వరూప్ మృతిపై సంతాపం

గోదావరిఖని: దూరదర్శన్ తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ అకాల మరణంపై తెలంగాణ ప్రజానాట్య మండలి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.స్వామి, కన్నం లక్ష్మీనారాయణ, ఇనుముల రాజమౌళి, ఎజ్జ రాజయ్య, చీకటి అంజయ్య, వై.లెనిన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పాటు దూరదర్శన్‌లో తెలుగు వార్తలు చదవడంలో తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారన్నారు.

వే బ్రిడ్జి కాంటాను తొలగించాలి

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన వే బ్రిడ్జిని తొలగించాలని శనివారం మంథనిలోని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ తెలిపారు. వే బ్రిడ్జితో రహదారి అస్తవ్యస్తంగా మారి ఇసుక లారీల పార్కింగ్‌తో ప్రజలకు అసౌకర్యం కలుగుతోందన్నారు. ప్రమాదాలు పొంచి ఉన్నాయి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అక్రమ వేబ్రిడ్జి కాంటాను తొలగించాలని ఆయన అధికారులను కోరినట్లు చెప్పారు.

తాగునీరు రాక గ్రామస్తుల ఇబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని వీర్లపల్లి, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ గ్రామాల్లో కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో వారంరోజులుగా తాగునీటి సరఫరా చేయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి 14వ డివిజన్ పరిధిలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక వేలం వాయిదా

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో ఇటీవల అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక డంపులను గుర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు ఇసుక డంపులకు శనివారం నిర్వహించాల్సిన వేలంలో క్యూబిక్ మీటర్ ఒక్కింటికి రూ.600 నిర్ణయించారు. వేలం దక్కించుకునేందుకు ఎవరూ రాకపోవడంతో వేలం రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు.

వాహనాల వేలం ద్వారా వచ్చిన ఆదాయం రూ.49,620

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు పట్టుబడిన వాహనాలకు శనివారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పలు వాహనాలు వేలం వెయ్యగా రూ 49,620 సమకూరినట్టు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. పలు గ్రామాల నుంచి వేలంలో పాల్గొని వాహనాలను కైవసం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా, ధ్యానం ఔషధం

గోదావరిఖని: ఆరోగ్య పరిరక్షణకు యోగా, ధ్యానం అద్భుత ఔషధంలా పనిచేస్తుందని శ్రీగాయత్రీ ధర్మపీఠం వ్యవస్థాపకుడు గొట్టిముక్కుల నారాయణచారి తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీ నుంచి మే 10 వరకు ఉచిత యోగా క్లాసులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మల్లయ్య, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో ఎంఈవోలకు సన్మానం

గోదావరిఖనిటౌన్: ట్రస్మా ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మండల విద్యాధికారి పి.సంపత్‌రావుకు వీడ్కోలు, నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.రాజయ్యను శనివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో సన్మానించారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో ఉద్యోగం చేసి ఇటీవల ఉదద్యోగ విరణ పొందిన సింగరేణి ఉద్యోగి పద్మశాలీ సేవా సంఘం కమిటీ సభ్యుడు పసునూటి సాంబశివరావును యూటింక్లయిన్‌కాలనీ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కాలనీ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండేటి రాజేశ్, ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేశ్, సంఘం నాయకులు శ్రీనివాస్, పద్మశాలీ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు, విజయ, కార్యదర్శి మల్లేశ్వరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను విస్మరిస్తున్నారు'



రైతుదీక్ష చేపట్టిన మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి రైతుదీక్ష చేపట్టారు. పంట చేతికందే దశలో సాగునీరందించలేని స్థితికి కాంగ్రెస్ సర్కార్ చేరిందని విమర్శించారు. పంట నష్టపోయిన, ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రఘువీర్‌సింగ్, శ్రీనివాస్, సంపత్, రాములు, వెంకటరెడ్డి, ప్రేంచందర్‌రావు, ఉప్పు రాజ్‌కుమార్, సందీప్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలి



నినాదాలు చేస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక చౌరస్తా సమీపంలో పార్టీ జెండా ఎగురవేశారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం జెండా మోస్తున్న పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కోమళ్ల పురుషోత్తం, మంతెన రాజయ్య, బూర్ల లక్ష్మీనారాయణ, గోపాల్‌రావు, ముప్పిడి సుధాకర్, మేరుగు హన్మంత్‌గౌడ్, బల్మూరి వనిత, గాండ్ల ధర్మపురి, సుల్వ లక్ష్మీనర్సయ్య, పెద్దపల్లి రవీందర్, కోమల మహేశ్, క్యాతం వెంకటరమణ, మహావాది రామన్న, కొండపర్తి సంజీవ్ పాల్గొన్నారు.

బీజేపీ టిఫిన్ బైటక్..

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జీఎం కాలనీలో టిఫిన్ బైటక్ బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులను సన్మానించారు. నాయకులు మామిడి రాజేశ్, మామిడి సంపత్, అడ్డూరి రాజేశ్, మంద శ్రీనివాస్, తాటిపర్తి శ్రీధర్‌రావు, గుండబోయిన భూమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల కోసం పోరాటం చేస్తాం



నివాళి అర్పిస్తున్న నాయకులు



పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ కాకుండా పోరాటం చేస్తామని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు అన్నారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. దేశానికి కావాల్సిన విద్య, వైద్యం, ఉపాధి, నిరుద్యోగ సమస్య, కార్మిక వేతనం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నాయకులు తుమ్మల రాజారెడ్డి, నాయకులు రామాచారి, మెండె శ్రీనివాస్, అరెపల్లి రాజమౌళి, దాసరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

పెద్దపల్లిరూరల్: సీఐటీయూ అఖిల భారత తొలి అధ్యక్షుడు బిటి రణదివే వర్ధంతి శనివారం పెద్దపల్లిలోని కార్యాలయంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, నాయకులు వెంకటస్వామి, సతీశ్, మరియా, స్వప్న, అన్వేష్, అంజయ్య, సాగర్ ఉన్నారు.

గుజ్జులను కలిసిన 'గోమాస'



పుష్పగుచ్ఛం ఇస్తున్న గోమాస శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ శనివారం పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డిని శనివారం ఆయన నివాసంలో కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గ్రూపు తగాదాలను మరిచి పార్టీ విజయానికి సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివేక్ వారసత్వ రాజకీయాలకు తెరలేపాడని గోమాస శ్రీనివాస్ ఆరోపించారు. రాజకీయ దోపిడీ చేస్తూ తన ఆస్తులను కాపాడుకోవడంపైనే దృష్టిసారించిన వివేక్ కుటుంబాన్ని తరిమేయాలన్నారు. నాయకులు అర్జున్‌రావు, రాజు, శ్రీనివాసరావు, రాంసింగ్, సమ్మయ్య ఉన్నారు.

క్రైం న్యూస్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామశివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన కట్కూరి రాజ్‌కుమార్ (26) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన రాజ్‌కుమార్, తన పెద్దనాన్న కొడుకు శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పై కమాన్‌పూర్‌లో జరిగిన దినకర్మకు హాజరయ్యాడు. తిరిగి వస్తుండగా ఎదరెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజ్‌కుమార్‌ను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించే సరికే మృతి చెందాడు. కాగా మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన సూర తిరుపతి(45) పెగడపల్లి శివారులో చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తిరుపతి తన భార్య స్వరూపతో కలిసి సుల్తానాబాద్ వెళ్లి వస్తుండగా ఫిట్స్ రావడంతో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా స్వరూపకు గాయాలయ్యాయి. ఎస్సై ఓంకార్‌యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన యాదగిరి లక్ష్మి ఉపాధి పనులకు వెళ్లి భర్త ఓదెలుతో తిరిగి వస్తుండగా ఇసుక లారీ ఢీ కొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. పెద్దపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించి తదుపరి వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. రాఘవాపూర్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో కారు లారీ ఢీకొన్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

గోదావరిఖనిటౌన్: స్థానిక కొత్త కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేసుకునే చేరాల లక్ష్మి తాను మేదరిబస్తీలోని కిరాయికి ఉండే రేకుల షెడ్డులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయి దగ్ధం అయ్యాయి. శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ అయినట్టు బాధితులు తెలిపారు. మంటలతో చుట్టుపక్కలా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిడ్జ్, టీవీ, బీరువా, బంగారం, బట్టలు ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.2లక్షల పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

రిపోర్టర్ల పేరుతో బెదిరించిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని: రిపోర్టర్ల పేరుతో రేషన్‌షాప్ డీలర్‌ను బెదిరించిన ఇద్దరిపై శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడు రంగు అభిలాష్ ఫిర్యాదు మేరకు రిపోర్టర్లుగా చెప్పుకుంటూ డబ్బులు ఇవ్వాలని లేకుంటే చంపుతామని బెదిరించిన గోదావరిఖనికి చెందిన శివ, సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఇద్దరు షాపువద్దకు వెళ్లి బెదిరించినట్లు పేర్కొన్నారు.